అంతుపట్టని ఓటరు నాడి

- విజయావకాశాలపై చర్చల వేడి
- పోలైన ఓట్లు 1,87,087
- 79.89 శాతం నమోదు

సీల్ వేసిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లను కౌంటింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న అధికారులు

కొల్లాపూర్, డిసెంబర్ 1: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాధాన్యం గల నియోజకవర్గంగా గుర్తింపు పొంది ప్రతిష్టాత్మకంగా పోటీ జరిగిన కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ సరళి ప్రజల్లో తీర్పు ఉత్కంఠ కలిగిస్తుండగా, నేతలకు ముచ్చెమటలు పడుతున్నాయి. గురువారం నిర్వహించచిన పోలింగ్‌లో కొల్లాపూర్ నియోజకవర్గంలో 2,34,167 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,87,087 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 79.89శాతం నమోదైంది. అయితే బీఆర్ఎస్‌కు ఈ నియోజకవర్గంలో 2012 ఉప ఎన్నికలు, 2014 ఎన్నికల్లో ఎదురులేని విజయం ఆ పార్టీ అభ్యర్థి సాధించాడు. 2018లో నాటి ఎన్నికల్లో రాజకీయ ఉద్దండుడు. బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును చిత్తుగా ఓడించిన ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థిగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి కొన్నాళ్లకు బీఆర్ఎస్‌లో చేరిన విషయం విధితమే. వీరిద్దరు తారుమారు కావడం ప్రస్తుతం కొల్లాపూర్‌లో పోటీపడుతున్నారు. ఇక్కడ 14మంది ఎన్నికల బరిలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ ఉన్న ది. కానీ ప్రధాన పోటీ బీఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే పోటీ జరిగింది. అయితే గురువారం జరిగిన పోలింగ్‌లో ఓటర్ల నాడి ఎవ్వరికీ అంతుబట్టని విధంగా ఉంది. ఎన్నికలు ప్రకటించి నాటి నుంచి ఎత్తులు, పైఎత్తులు, రకరకాల ఒత్తిళ్ల మధ్య నగిలిపోయిన కులాలు, వర్గాలు, ఓటర్లు అందరికీ సానుకూలంగా స్పంది స్తూ వచ్చారు. ఓటు వేసే విషయంలో మాత్రం తమ అంతరంగాన్ని బయటపెట్టకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో ఆ ఓటు తమదంటే తమదంటూ ప్రధాన పార్టీల నేతలు సంబరపడుతూ వచ్చారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రధాన పార్టీల నేతలు వేర్వేరు గ్రూపులుగా ఏర్పడి ఓటింగ్ సరళిపై జరుపుకుంటున్న చర్చలు. సమీక్షలు ఆసక్తికరంగా ఆశ్చర్యంగా ఉన్నాయి. ఫలానా గ్రామంలో తమదే మెజార్టీ అని ఒక పార్టీ వారు. ఇంత పర్సంటేజీ ఓట్లు తమవని మరొకరు, అసలు ఆ గ్రామం మొత్తం మాదేనని ఒకరు, వారికి చెప్పి మాకు ఓటేస్తామన్న స్పష్టమైన హామీ ఉందన్న ధీమాలో మరొకరు ఇలా ఎవ్వరి అంచనాలు వారికి ఉండగా, ఓటర్లు మాత్రం రాజకీయ పరిశీలకులకు సైతం అంతుపట్టనికుండా ప్రశాంతంగా తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏ పార్టీ గెలుస్తుందన్న విషయం ఓట్ల లెక్కింపు తర్వాత బయటపడటం సహజమే, అయినా ఎంతోకొంత ట్రెండ్ పోలింగ్ రోజు బయటపడటం మామూలు విషయమే. అలాంటి కొల్లాపూర్ నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దీనికితోడు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ వర్గాల్లో కూడా ఎవరికి వారు తామే గెలుస్తామన్న ధీమాలో ఉన్నారు.

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం..

గురువారం జరిగిన శాసనసభకు ఎన్నికలు ముగియడంతో ఈవీఎంలను ఓట్ల లెక్కింపు కోసం నాగర్‌కర్నూల్ సమీపంలోని నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించారు. ఆదివారం ఓట్ల లెక్కింపు జరుగనున్నడంతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. దీంతో ఓట్ల లెక్కింపులో ప్రజాతీర్పు ఎలా వస్తుందోనన్న భయంతో అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్ మొదలైంది.

పోలింగ్ నమోదు ఇలా..

గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,34,167 ఓటర్లకు గానూ 1,87,087 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 79.89శాతం నమోదైంది. ఇందులో పురుష ఓటర్లు 1,19,263 ఉండగా, 95,876 ఓట్లు పోలయ్యాయి. కాగా 80.39శాతం నమోదైంది. అలాగే మహిళా ఓటర్లు 1,14,900 ఉండగా ఇందులో 91,209 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోగా 79.38శాతం నమోదైంది. ఇతరులు నలుగురు ఉండగా ఇద్దరే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018లో ఎన్నికల నాటికి మొత్తం ఓటర్లు 2,08,941ఉండగా, ఇందులో 1,72,846 ఓట్లు పోలై 82.72శాతం నమోదైంది. 2018 ఎన్నికల నాటి ఓటర్ల సంఖ్య కంటే ప్రస్తుతం అదనంగా 25,226 ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. అలాగే 2014 ఎన్నికల్లో 2,08,275 ఓటర్లకు గాను 1,54,015 ఓట్లు పోల్ కాగా 74శాతం నమోదైంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో 789 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ఓటింగ్‌శాతం వివరాలు నమోదు కాలేదు.

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి

- వీపనగండ్లలో ఎయిడ్స్ డే ర్యాలీ

వీపనగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

వీపనగండ్ల, డిసెంబర్ 1: ఎయిడ్స్ డే ను పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, సేవాభావంతో ఆదరించాలన్నారు. ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపరాదన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 1: మండల పరిధిలోని చిన్నకార్పాముల, పెద్ద కార్పాముల, మరికల్ గ్రామాల్లో వేరుశనగ పంటలను వ్యవసాయ అధికారి రవినాయక్ పరిశీలించారు. తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం సూచించిన పురుగుల మందులనే వాడాలని తెలిపారు. అనుమతి లేని ఎరువుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేయరాదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు రైతువేదికల వద్ద ఏఈఓలు ఉంటారని, వారిని సంప్రదించాలని తెలిపారు. రైతులు పంటల మార్పిడీ విధానాన్ని అవలంభిస్తే పంట దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో, రైతులు ఉన్నారు.

మైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి

మైసమ్మ దేవతకు పూజలు చేస్తున్న స్వామి యాదవ్

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 1: మండల పరిధిలోని నాయినేనిపల్లి మైసమ్మ దేవతను హైదరాబాద్ రాజేంద్రనగర్ ఎంఐఎం ఎమ్మెల్యే అభ్యర్థి స్వామియాదవ్ మైసమ్మ దేవతను సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిగా కొల్లాపూర్ నియోజకవర్గం చుక్కాయిపల్లికి చెందిన స్వామియాదవ్ హైదరాబాద్‌లో కార్బన్ డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందాలని మైసమ్మను సందర్శించుకుని మొక్కుచెల్లించారు. ఆయనవెంట ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాన్‌గల్, డిసెంబర్1: మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన సంగనమోని శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేతేపల్లి ఉన్నత పాఠశాలలో టెన్త్ 1993-94 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు, తమ వంతు సాయంగా రూ.37,900 డబ్బులు పోగు చేశారు. శ్రీనివాసులు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి సాయం అందజేశారు. కార్యక్రమంలో బాబర్, బాలస్వామి, డబ్బా వెంకటయ్య, విష్ణు, నరసింహారెడ్డి, రాము, ఆంజనేయులు, మైబూస్ పాల్గొన్నారు.

కేతేపల్లిలో స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రబృందం

ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం

పాన్‌గల్ మహిళకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్, డిసెంబర్ 1: ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం అందుతుందని మండల వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి అన్నారు. మండలంలోని కదిరేపాడు గ్రామానికి చెందిన గర్భిణికి శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం కేసీఆర్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానలో సాధారణ కాన్పులు జరుగుతున్నాయని, ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

'అచ్చంపేటలో గువ్వలదే గెలుపు'

వంగూరు, డిసెంబర్ 1: అచ్చంపేటలో మరోసారి విప్ గువ్వల బాలరాజు గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ఉప్పల్‌పహాడ్ మాజీ సర్పంచ్ రజితశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్ని డబ్బులు పంచినా, ఎన్ని కుట్రలకు పాల్పడినా ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకంతో గువ్వల బాలరాజుకు ఓటేశారన్నారు. గువ్వల గెలుపును అడ్డుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డిన ప్రత్యర్థులు, ఈనెల 3న వెలువడే ఫలాతాలతో తెల్లముఖం వేయకతప్పదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజల పట్ల ఆయన ప్రేమను వారు మరిచిపోకుండా కారు గుర్తుకు ఓటేశారన్నారు. ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యర్థులు, ఏజెంట్లతో అబ్జర్వర్, ఆర్వో సమావేశం

పార్టీల వారీగా ఎన్నికల వ్యయం, ఇతర అంశాలపై చర్చ

అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లతో సమావేశమైన జనరల్ అబ్జర్వర్ సురేశ్‌కుమార్, ఈఆర్వో కుమార్‌దీపక్

కొల్లాపూర్, డిసెంబర్ 1: కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లతో శుక్రవారం మధ్యాహ్నం నాగర్‌కర్నూల్ సమీపంలో నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో(ఓట్ల లెక్కింపు కేంద్రంలో) ఎన్నికల సాధారణ పరిశీలకులు సురేశ్‌కుమార్, ఈఆర్వో కుమార్ దీపక్ సమావేశమయ్యారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఈసమావేశంలో ఎన్నికల సహాయ అధికారి శ్రీకాంత్, డిప్యూటీ తాసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావు, ఇతర పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.